సాక్షి
కామారెడ్డి
శనివారం । 19 । ఆగస్టు । 2023



అర్హులకు ప్రభుత్వ పథకాలు..

అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు.

- 8లో ▸



కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం..

వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తోపాటు పేదలకు భూములు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /22.6

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు'



పిట్లం: రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ సారథ్యంలోని ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పిట్లంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూంల ఊసేలేదన్నారు. తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 5 కే రన్

కామారెడ్డి క్రైం: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలో 5 కే రన్ నిర్వహించనున్నట్లు డీపీఆర్‌వో శాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు నిజాంసాగర్ చౌరస్తా నుంచి కళాభారతి వరకు పరుగు ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అధికారులు పాల్గొనే రన్‌లో పెద్ద ఎత్తున ప్రజలు, యువత భాగస్వాములు కావాలని కోరారు.

'పౌష్టికాహారం తీసుకోవాలి'




రామారెడ్డి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని యూనిసెఫ్ కన్సల్టెంట్ ఆఫీసర్ నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం రామారెడ్డిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను యూనిసెఫ్ బృందం పరిశీలించింది. రామారెడ్డిలోని అంగన్‌వాడీలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో బృంద సభ్యులు పాల్గొన్నారు. అంగన్‌వాడీలలో సీమంతాలతోపాటు అన్నప్రాసన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు సుబ్బారావు, విజయపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, రామారెడ్డి ఉపసర్పంచ్ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించాలి'

కామారెడ్డి క్రైం: విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9 థియేటర్లలో సినిమాను ప్రదర్శిస్తున్నామని, ఇప్పటివరకు 19,788 మంది విద్యార్థులు చిత్రాన్ని చూశారని పేర్కొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: సెకండ్ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఎలాంటి షరతులు, పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. నాయకులు ఎస్సార్ రాజశేఖర్, రైతు సంఘం జిల్లా కన్వీనర్ దేవయ్య, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ శివప్రసాద్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్‌లు సమ్మెకు మద్దతు తెలిపారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎల్లారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ సారథ్యంలోని ప్రభుత్వమేనని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అడివిలింగాల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయం వేడెక్కుతోంది. వచ్చే అసెంబ్లీ ఎలక్షన్స్‌లో పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతున్నవారు.. టికెట్ల కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల్లో టికెట్ల కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో పోటీ తీవ్రంగా ఉంది. ఇప్పటికే పీసీసీ ఆధ్వర్యంలో టికెట్టు కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. కామారెడ్డి మినహా మిగతా మూడు చోట్ల పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ ఉంది.

– సాక్షి, కామారెడ్డి



జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి క్యాడర్‌తోపాటు బలమైన లీడర్లూ ఉన్నారు. వచ్చే ఎన్నికలలో పోటీ చేయాలని భావిస్తున్నవారు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో మినహా మిగతా మూడు చోట్లా నేతలు గ్రూపులుగా విడిపోయి పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఆశావహులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత సర్వేలు నిర్వహించి బలం, బలగాలను అంచనా వేసి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. దీంతో శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. ఏ నియోజకవర్గంలో ఎవరికి టికెట్టు వస్తుందో? అభ్యర్థిత్వం దక్కనివారు ఎలా స్పందిస్తారో అన్న విషయాలపై జోరుగా చర్చ జరుగుతోంది.

- కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీ అభ్యర్థిత్వంపై స్పష్టత
- ఎల్లారెడ్డిలో టికెట్టుకోసం ఇద్దరు నేతల మధ్య కుస్తీ
- జుక్కల్‌లో పోటీకి సై అంటున్న ముగ్గురు లీడర్లు
- బాన్సువాడలోనూ పెరుగుతున్న ఆశావహులు

కామారెడ్డినుంచి ఒక్కరే!

జిల్లాలో కీలకమైన కామారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ పోటీ చేస్తారన్న విషయమై స్పష్టత ఉంది. షబ్బీర్‌అలీ నిత్యం ఏదో ఒక మండలంలో పర్యటిస్తున్నారు. ఎన్నికలలో ఓడిపోయినా జనం మధ్యే ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టే పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇతర పార్టీల్లోని గ్రామ, మండల స్థాయి నేతలను తనవైపు తిప్పుకుంటున్నారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో చెమటోడుస్తున్నారు. సర్వేలు కూడా తనకు అనుకూలంగా ఉన్నాయంటూ ఆయన గతంలో పార్టీని వీడిన వారిని తిరిగి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ స్నేహహస్తం అందిస్తున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నారు. ఇక్కడ పార్టీ రెండుగా చీలిపోయి ఏళ్లుగా వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుభాష్‌రెడ్డికి పీసీసీ చీఫ్‌తో సన్నిహిత సంబంధాలుండగా.. మదన్‌మోహన్‌రావుకు రాష్ట్ర, జాతీయస్థాయి నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ టికెట్టు విషయంలో ధీమాతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరతారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన కూడా టికెట్టు పైరవీలో ఉన్నట్టు చెబుతున్నారు. ఒకవేళ రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే పరిస్థితి ఎలా ఉంటుందన్న విషయమై పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

బాన్సువాడలో..

బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి పలువురు ముందుకొస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన కాసుల బాల్‌రాజు తిరిగి పోటీ చేయడానికి రెడీగా ఉన్నారు. అయితే ఆయనకు వ్యతిరేక వర్గంగా ఉన్న యలమంచిలి శ్రీనివాస్‌రావ్, కూనిపూర్ రాజిరెడ్డి, అంబర్‌సింగ్ తదితరులు ఇటీవల కాంగ్రెస్ హైకమాండ్ వద్దకు వెళ్లి కాసుల బాల్‌రాజుకు టికెట్టు ఇవ్వవద్దని కోరారు. వీరంతా పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావుతో సన్నిహిత సంబంధాలున్నవారు కావడం గమనార్హం. మదన్‌మోహన్‌రావు బాన్సువాడలో పోటీ చేయాలని కూడా వారు కోరుతున్నారు. అలాగే న్యాయవాది వెంకట్రాంరెడ్డి కూడా టికెట్టు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది.

జుక్కల్‌లో..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన జుక్కల్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి ముగ్గురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారామ్‌కు రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న ఆయన నాలుగుసార్లు జుక్కల్‌కు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు అన్ని గ్రామాల్లోనూ అనుచరులున్నారు. మరో నేత లక్ష్మీకాంతరావ్ సైతం కొంతకాలంగా నియోజకవర్గంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కుల సంఘాలు, ఆలయాలకు పెద్ద ఎత్తున నిధులు అందజేస్తున్నారు. ఆయన తనకే టికెట్టు వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన గడుగు గంగాధర్ కూడా జుక్కల్ నుంచి పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

సర్కారుకు దరఖాస్తు కిక్కు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- మద్యం దుకాణాలకు పోటెత్తిన దరఖాస్తులు
- 49 షాప్‌లకు 2,164 అప్లికేషన్లు..
- అంచనాలను మించి దాఖలు

సాక్షి, కామారెడ్డి: మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 49 వైన్ షాప్‌లు ఉండగా.. 2,164 అప్లికేషన్లు నమోదయ్యాయి. నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు ద్వారా సర్కారుకు రూ. 43.28 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్ర ప్రభుత్వం 2023–25 సంవత్సరాలకుగాను కొత్త మద్యం పాలసీని అమలు చేయడంలో భాగంగా మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. చివరి రోజున భారీ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. దీంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. 2021–23 సంవవత్సరంలో 49 మద్యం దుకాణాలకు 981 దరఖాస్తులు రాగా.. ఈసారి పోటీ పెరుగుతుందని, 1,600 వరకు రావొచ్చని ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది. అయితే అంచనాలను మించి దరఖాస్తులు రావడంతో అధికారులే విస్తుపోతున్నారు. కొన్ని దుకాణాలకు తక్కువ దరఖాస్తులు రాగా.. మరికొన్నింటికి అర్ధసెంచరీ దాటాయి. అత్యధికంగా నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి మద్యం దుకాణానికి 88 దరఖాస్తులు వచ్చాయి. తాడ్వాయి దుకాణానికి 86 దాఖలయ్యా యి. అత్యల్పంగా నిజాంసాగర్ మండలంలోని మద్దెల చెరువు షాప్‌నకు 2 అప్లికేషన్లు మాత్రమే రావడం గమనార్హం. మాచారెడ్డి, దోమకొండ తదిత ర ప్రాంతాల్లో కొన్ని దుకాణాలకు ఎక్కువ సంఖ్య లో దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. సాయంత్రం వరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారు ల నుంచి రాత్రి వరకూ దరఖాస్తులు స్వీకరించారు.

అర్ధరాత్రి వరకు స్వీకరణ

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో శుక్రవారం అర్ధరాత్రి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం వరకు గడువు ఉండగా.. అప్పటికే చేరుకున్న వారిని లోపలే కూర్చోబెట్టి దరఖాస్తులు స్వీకరించారు. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో దరఖాస్తులు, డాక్యుమెంట్లు, డీడీలను పరిశీలించి రశీదులు ఇవ్వడానికి ఎక్కువ సమయం తీసుకుంది. దీంతో రాత్రి వరకూ ప్రక్రియ కొనసాగింది. ఈనెల 21న డ్రా ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు.

జిల్లాలో సర్కిళ్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు..

సర్కిల్	వైన్‌షాప్‌లు	దరఖాస్తులు
కామారెడ్డి	15	744
దోమకొండ	8	421
ఎల్లారెడ్డి	7	313
బాన్సువాడ	9	343
బిచ్కుంద	10	343

ఎన్నికల నేపథ్యంలో పెరిగిన పోటీ..

రాబోయే ఏడాది కాలంలో వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. మొదట అసెంబ్లీకి, ఆ తర్వాత పార్లమెంట్‌కు ఎన్నికలు వస్తాయి. వెనువెంటనే మున్సిపల్, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత సహకార ఎన్నికలు కూడా జరుగుతాయి. ఈ నేపథ్యంలో మద్యం అమ్మకాలు భారీగా జరుగుతాయని భావిస్తున్నారు. దీంతో వైన్‌షాప్‌ల టెండర్లకు పోటీ తీవ్రత పెరిగింది. గతంలో మద్యం దుకాణాలు నిర్వహించిన వారితో పాటు కొత్తగా చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్న నేపథ్యంలో ఆ రంగానికి సంబంధించిన వారు మద్యం వ్యాపారం వైపు మళ్లినట్టు స్పష్టమవుతోంది. దీనికి తోడు బిజినెస్ దోస్తులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్, క్లాస్‌మేట్స్, పొలిటికల్ ఫ్రెండ్స్... ఇలా గ్రూపులుగా పదుల సంఖ్యలో దుకాణాలకు టెండర్లు దాఖలు చేశారు. డ్రాలో అదృష్టం కలిసొస్తే అందరూ కలిసి దందా చేసుకోవచ్చన్న ఉద్దేశంతో గ్రూపులు, సిండికేట్ల వారీగా వైన్‌షాప్‌లకు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఒక వ్యక్తి తన బంధువులు, స్నేహితుల పేర్లతో యాభైకి పైగా దుకాణాలకు దరఖాస్తు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

సమస్యలకు పరిష్కారం చూపండి

- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ
- విద్యుత్ అధికారుల తీరుపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆగ్రహం
- తన నియోజకవర్గంనుంచి డిప్యుటేషన్లు వద్దన్న జుక్కల్ ఎమ్మెల్యే
- రుణమాఫీపై ధన్యవాదాలు తెలిపిన జెడ్పీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శోభ, వేదికపై ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు, కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

కామారెడ్డి అర్బన్: సభ్యులు లెవనెత్తిన సమస్యలకు అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పేర్కొన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ శోభ అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండాలో 54 అంశాలుండగా 9 అంశాలపై చర్చించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, వైద్య ఆరోగ్య, విద్య, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, నీటిపారుదల, విద్యుత్, పశుసంవర్ధక శాఖలపై సంబంధిత జిల్లా అధికారులు నివేదకలు చదివి వినిపించారు.

- భర్తకు ఆసరా పెన్షన్ ఉండి చనిపోయిన సందర్భంలో మాత్రమే భార్యకు దరఖాస్తు చేసిన వెంటనే వితంతు పెన్షన్ ఇస్తున్నారని, భర్తకు పెన్షన్ లేని వితంతువులకు దరఖాస్తు చేసే అవకాశమే లేదని నాగిరెడ్డిపేట, రామారెడ్డి జెడ్పీటీసీ సభ్యులు మనోహర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్‌కార్డులు లేక చాలామంది సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోతున్నారని కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్ అన్నారు.
- సదరం సర్టిఫికెట్ల జారీ విషయంలో తక్షణ పరిష్కారం చూపాలని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు కోరగా.. ప్రతినెల ఐదారుగురికి రీఅసెస్‌మెంట్‌కు అనుమతులు వస్తున్నాయని డీఆర్‌డీవో సాయన్న తెలిపారు. వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు సంబంధించి జిల్లాకు రూ. 26 కోట్ల సాయం మంజూరైందని డీఏవో భాగ్యలక్ష్మి తెలిపారు. సదాశివనగర్ మండలంలో వ్యవసాయాధికారి తప్పిదంతో పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు కాలేదని జెడ్పీటీసీ సభ్యుడు నర్సింలు ఆరోపించారు. పిట్లంలో సహకార బ్యాంకు అధికారులు అసైన్‌మెంట్ భూములకు పంట రుణాలు ఇవ్వడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు.
- గర్గుల్, రామారెడ్డి వంతెనల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి కోరారు. నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి–మద్దూర్ మధ్య ఏళ్లుగా పనులు పూర్తి చేయకపోవడం, నాగిరెడ్డిపేటకు మంజూరైన జూనియర్ కళాశాల, ఐటీఐలను ఇప్పటికీ నెలకొల్పకపోవడంపై ఎంపీపీ రాజ్‌దాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు.
- జిల్లాలోని పశువైద్యశాలల్లో కనీసం వెటర్నరీ సహాయకులు కూడా లేకపోవడంతో పశువులకు వైద్యం అందడం లేదని కోఆప్షన్ సభ్యుడు మజీద్ పేర్కొన్నారు. పశువులు, కోళ్లు, జీవాల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అందించే పథకంపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని, తగిన ప్రచారం చేయాలని మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు కోరారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై టీచర్లను పంపాలని పలువురు సభ్యులు కోరారు. రూ. లక్షలోపు పంట రుణాల మాఫీ, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్, అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

సమయానికి సమావేశం..

జెడ్పీ సమావేశాల తీరుపై 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. సమావేశాలు సకాలంలో ప్రారంభంకావడం లేదని, అజెండాలోని అంశాలపై విస్తృత చర్చ జరగడం లేదని ఆ కథనంలో పేర్కొనగా.. ఈసారి సభ్యులు, అధికారులు దాదాపు సకాలంలో జెడ్పీకి చేరుకున్నారు. దీంతో ఈసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జాప్యం లేకుండా ప్రారంభమైంది. షరా మామూలుగా నాలుగైదు అంశాలతో సరిపెట్టకుండా తొమ్మిది అంశాలపై చర్చించారు.

ఏఈలను బదిలీ చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యుత్ అధికారులు బాధ్యతలేకుండా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే సురేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడ్వాయి మండలంలోని సోమారంలో వారం రోజుల పాటు త్రీఫేజ్ కరెంట్ సరఫరా లేదని, ఈ విషయమై తాను మాట్లాడినా ఏఈ స్పందించలేదని పేర్కొన్నారు. చిట్యాల, సంతాయిపేటల్లో విద్యుత్ అంతరాయంపై ప్రశ్నించగా.. అక్కడి లైన్‌మన్ విధులకు గైర్హాజరవుతున్నందున మెమో జారీ చేశామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్ బాబు బదులిచ్చారు. పనిచేయని ఏఈలను వెంటనే బదిలీ చేయాలని సురేందర్ ఎస్ఈని కోరారు. చద్మల్‌లో మూడు నెలల క్రితం వేసిన కరెంట్ స్తంభాలు అప్పుడే వంగిపోతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు శంకర్ నాయక్ ఆరోపించారు. దోమకొండ 132కేవీ విద్యుత్‌లైన్‌లో జాప్యంపై జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్ ప్రశ్నించగా అది ట్రాన్స్‌కో అధికారుల పరిధిలో ఉంటుందని ఎస్ఈ రమేష్ బాబు బదులిచ్చారు.

జుక్కల్ నుంచి సర్దుబాటు చేయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

తనకు తెలియకుండా జుక్కల్ నియోజకవర్గం నుంచి అధికారులెవరికీ డిప్యుటేషన్లు ఇచ్చినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే హెచ్చరించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి వైద్యుల పోస్టుల ఖాళీలపై మాట్లాడుతుండగా ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నారు. తన నియోజకవర్గం మారుమూలన ఉన్నందున కొత్తగా వచ్చేవారు ఆసక్తి చూపరని, ఈ నేపథ్యంలో ఇక్కడ ఉన్నవారిని డిప్యుటేషన్‌పై పంపవద్దని సూచించారు. పిట్లం, బిచ్కుంద, జుక్కల్ ఆస్పత్రుల్లో ఒక్క వైద్యుడు కనిపించడం లేదన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటైనందున జిల్లాకేంద్ర ఆస్పత్రిలోని వైద్యులను వివిధ ఆస్పత్రులలో సర్దుబాటు చేస్తామని సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. తనకు తెలియకుండా బదిలీలు చేపట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు. నాగమడుగు ఎత్తిపోతల పైప్‌లైన్ పనులలో జాప్యంపై పిట్లం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి నీటి పారుదల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో పనులు చేపడతామని ఎస్ఈ బదులిచ్చారు.

క్లుప్తంగా

పిల్లల్ని వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు



మద్నూర్(జుక్కల్): పిల్లల్ని ఎవరైనా వేధింపులకు గురి చేసి ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని బాలల హక్కుల సంరక్షణ జిల్లా అధికారి సంతోష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలికలకు బాలల హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంరక్షణ అవసరం ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించడం, ఎవరైనా బాల్య వివాహాలు చేసినట్లయితే 1098 ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

నాణ్యమైన విద్యను బోధించాలి

బాల్కొండ : నాణ్యమైన విద్యను బోధించాలని జిల్లా ఇంటర్ అధికారి రఘురాజు అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నాణ్యత ప్రమాణాలు మెరుగుపర్చాలని అధ్యాపకులకు సూచించారు. ప్రిన్సిపాల్ చిన్నయ్య, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ రిపోర్టర్ మృతి



పిట్లం(జుక్కల్): పిట్లం మండల 'మన తెలంగాణ' రిపోర్టర్ మండలి ప్రశాంత్ (48) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ప్రశాంత్ కొన్ని రోజులుగా ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు పిట్లంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ప్రశాంత్ మృతి పట్ల విలేకరులు, అధికారులు, నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం : హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. ఎల్లారెడ్డిలోని రామాలయం వెనుక ప్రాంతంలో 2021 జూన్ 11న అదే పట్టణానికి చెందిన షేక్ జాఫర్ హైమద్ (34) హత్యకు గురయ్యాడు. జాఫర్ హైమద్‌తో సన్నిహితంగా ఉండే షేక్ మహబూబ్ అనే వ్యక్తి మద్యం సేవిస్తుండగా గొడవ పడి హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో మహబూబ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి నేరం రుజువు కావడంతో హత్యకు పాల్పడిన మహబూబ్‌కు జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

భిక్కనూరు : మండల కేంద్రంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఒక్కరు శుక్రవారం మృతి చెందారు. మండల కేంద్రానికి చెందిన కుర్రి సిద్ధరాములు (48) గత నెల 13వ తేదీన బైక్‌పై రామాయంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా కుక్క అడ్డురావడంతో సడన్ బ్రేక్ వేయగా కిందపడ్డాడు. దీంతో సిద్ధిరాములకు తీవ్రగాయాలు కాగా వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు,కుమార్తె ఉన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చర్యలు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకాల అమలుపై పలు సూచనలిచ్చారు. జిల్లాలో అమలు చేస్తున్న పథకాల గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. సంపద వనాలు, హరితహారం లక్ష్యాలను ఈనెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రతివారం జిల్లాలో 100 గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ, మైనారిటీలకు ఆర్థిక సహాయానికి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ పత్రాల పంపిణీని త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి ధ్రువీకరణను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్‌డీవో సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా పశు సమర్ధక శాఖ అధికారి సింహారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా రుణాలివ్వాలి

కామారెడ్డి క్రైం: లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు అర్హులైన వారికి రుణాలు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకులు 32 శాతం లక్ష్యాలనే సాధించాయన్నారు. లక్ష్యం మేరకు రెండో త్రైమాసికం నాటికి 50 శాతం లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలన్నారు. వెనకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలను విరివిగా అందించాలన్నారు. పంటరుణ మాఫీకి సంబంధించి జిల్లాకు చెందిన 32 వేల మంది రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యాయన్నారు. మరో 4,359 మంది రైతులకు సంబంధించి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ భార్గవ్ సుధీర్, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ అంబరీష్, టీజీబీ మేనేజర్ నవీన్, ఆర్‌బీఐ అధికారి అనిల్, నాబార్డ్ అధికారి ప్రవీణ్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ అనిల్, హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్



కామారెడ్డి క్రైం: నాటి పాలకుల అరాచకాలను అణచి వేసేందుకు పుట్టిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. సర్వాయి పాపన్న జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహనీయులు ఏ ఒక్క కులం కోసమో కాకుండా అందరి కోసం పాటుపడ్డారన్నారు. ప్రతి ఒక్కరు వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు కూడా బీసీ బంధు వర్తింప చేయాలని గౌడ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు, సీపీవో రాజారాం, డీపీఆర్‌వో శాంతి కుమార్, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గట్టగోని గోపీగౌడ్, బీసీ సంఘాల నాయకులు బాలార్జున్‌గౌడ్, మహేష్‌గౌడ్, శివరాం, నాగభూషణం పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

దోమకొండ/కామారెడ్డి అర్బన్: దోమకొండ, బీబీపేట మండలాలకు వెళ్లే భిక్కనూరు మండలం జంగంపల్లి బీటీఎస్ సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీ బీబీపాటిల్‌కు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేంకుమార్, దోమకొండ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్‌లు వినతి పత్రం అందజేశారు. అండర్ పాస్ లేకపోవడం వల్ల రెండు మండలాలతో పాటు సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతానికి వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. భిక్కనూరు టోల్‌గేట్ వరకు వాహనాలు వెళ్లి తిరిగి రావాల్సి వస్తుందని, ఈ విషయంలో స్పందించి అండర్ పాస్ నిర్మాణం చేపట్టేలా చూడాలని వారు కోరారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో బైక్‌ను దొంగిలించిన నిందితున్ని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మండల కేంద్రానికి చెందిన పసుకంటి సురేష్ ఈ నెల 16న రాత్రి తన బైక్ ఇంటి ముందు పార్కింగ్ చేసి నిద్ర పోయాడు. తెల్లారి ఇంటిముందు బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు పిర్యాదు చేశాడు. బాధితుని పిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన సింగజోగి మోహన్ బైక్‌ను దొంగిలించినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

రెంజల్(బోధన్) : మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16వ తేదీన ఇంట్లో నుంచి చిన్న కుమారుడిని తీసుకెళ్లినట్లు అత్త బేగరి మైసమ్మ ఫిర్యాదు అందించారన్నారు. నవీపేట్‌లోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పెద్ద కుతురిని కూడా వెంట తీసుకెళ్లిందన్నారు. తన కుమారుడు రవికి బోధన్ మండలం సంగెం గ్రామానికి చెందిన సువర్ణతో పదేళ్ల కిందట వివాహమైందన్నారు. వారికి ముగ్గురు సంతానం ఉన్నారన్నారు. ఇంట్లో ఉన్న చిన్న కుమారుడితో పాటు నవీపేట్‌లో చదువుకుంటున్న పెద్ద కుతుర్ని తీసుకుని వెళ్లినట్లు అత్త ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి



కె. సాయిలు(ఫైల్)

రాజంపేట : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన రాజంపేట మండలం ఎల్లారెడ్డి పల్లిలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కప్పల సాయిలు(45) ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది క్రితం ఆటో, ట్రాక్టర్ డోజర్ కొనుగోలు చేశాడు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దీంతో నిత్యం మనస్థాపానికి గురయ్యేవాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. బామ్మర్ది చిన్న పోచయ్య ఫోన్ చేస్తే స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద ఉన్నానని తెలిపారు. అక్కడికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయినట్లు వారు గుర్తించారు. వెంటనే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పెద్ద నాన్న రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాంధారిలో మరో యువకుడు..

గాంధారి(ఎల్లారెడ్డి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మండలకేంద్రానికి చెందిన రాజశేఖర్ (29) అనే యువకుడు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ స్థానికంగా ఓ రసాయన ఎరువుల దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తాడు. ఈనెల 15న ప్రమాదవశాత్తు ఎరువుల బస్తాలు జారిపడడంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజామాబాద్ నగరంలో..

ఖలీల్‌వాడి : నగరంలోని 1వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్రూట్ మార్కెట్ వద్ద బైక్ స్కిడ్ అయి పడిపోవడంతో షేక్ ఆలమ్స్ అలియాస్ షేక్ సమీర్(17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఈనెల 13న అర్సపల్లి నుంచి నిజామాబాద్ వైపు వస్తుండగా ఫ్రూట్ మార్కెట్ దగ్గరలోని హోటల్ వద్ద బైక్ స్కిడ్ కావడంతో తలకు తీవ్రగాయాలు కాగా జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో స్నేహితుడు మహ్మద్ సయ్యద్ షేక్ జాఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడు నిర్మల్ జిల్లా బాసరలోని శారదనగర్‌కు చెందినవాడని నాలుగేళ్లుగా నిజామాబాద్‌లో లేబర్ పని చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పాలన

- ఉచిత విద్యుత్ ఇచ్చింది మేమే..
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో పాటు పేదలకు ఉచితంగా భూములు ఇచ్చింది కాంగ్రెస్సేనని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పాలన సాగిందన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాచారెడ్డి మండలంలోని మద్దికుంట, భవానీపేట గ్రామాలకు చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సీఎం కేసీఆర్‌కు మరోసారి దళితులు, బీసీలు గుర్తుకు వచ్చారన్నారు. దళిత బంధు పేరుతో ఎన్నికల రాజకీయం ప్రారంభించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు అంటూ గ్రామానికి ఐదుగురికి కూడా లబ్ధి చేకూర్చడం లేదని, బీసీ బంధు అంటూ గ్రామానికి పది మందికి కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మైనారిటీ బంధు కూడా కొందరికి ఇచ్చి ప్రజల మధ్య గొడవలు పెట్టారని ఆరోపించారు. ఏకకాలంలో పంట రుణాలను మాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ సొంతమన్నారు. కాంగ్రెస్ అమలు చేసిన పథకాలనే కాపీ కొడుతూ బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారెడ్డి మోహన్‌రెడ్డి. గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ నాయక్, పండ్ల రాజు, నర్సాగౌడ్, నౌసి నాయక్, సందీప్, లక్ష్మారెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, కుల సంఘాల భవనాలకు నిధులు ఇచ్చామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన పలు కుల సంఘాల సభ్యులు ఆయనను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాణ్యత లేని డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టారని, వాటిని కూడా పేదలకు పంచలేదని విమర్శించారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు పథకాలను బీఆర్ఎస్ నాయకులు తమకు నచ్చిన వారికే ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారం మధు, రామస్వామిగౌడ్, ఆశబోయిన శ్రీనివాస్, శ్రీకాంత్, నర్సింలు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్



రాంపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పిట్లం(జుక్కల్): ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పథకాల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పేర్కొన్నారు. ఆయన మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం పిట్లం మండల కేంద్రం, రాంపూర్, గౌరారం గ్రామాలలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, మోహన్ రెడ్డి, అద్నాన్ మహి, అశోక్, భాస్కర్, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బట్వాడా చేయకుండా ఇంట్లో పారేసి..

- కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసులో పోస్ట్‌మన్ నిర్వాకం
- పోలీసు కేసు నమోదు చేయాలని బాధితుల ఫిర్యాదు



పోస్ట్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఓ బాధితుడు



బట్వాడా చేయకుండా పారేసిన ఉత్తరాలు

కామారెడ్డి అర్బన్ : ఒకటి కాదు రెండు కాదు ఏకంగా బస్తాల కొద్ది పోస్టుకార్డులు, బ్యాంకు ఏటీఎం, ఆధార్ కార్డులు, ఎల్ఐసీ పాలసీ బాండ్లు, పాస్ పోర్టులు, సాధారణ ఉత్తరాలు బట్వాడా చేయకుండానే చేసినట్టు రాసుకొని ఇంట్లో నిల్వ చేసిన పోస్టుమెన్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసుకు చెందిన పోస్టుమెన్ సీతారాం గత కొన్ని నెలలుగా పట్టణంలో బట్వాడా చేయకుండానే చేసినట్టు రాసుకుంటున్నట్టు తేలింది. ఈ విషయమై పలువురు బాధితులు పోస్టుమాస్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సీతారాం నిర్వాకం కొత్తేమీ కాదని గత కొన్నేళ్లుగా ఒక్కో రిజిస్టర్ లెటర్ బట్వాడాకు రూ. వంద తీసుకుంటుండడంతో అతన్ని ఇతర విధుల్లోకి బదిలీ చేశారని అంటున్నారు. గత సంవత్సరం కొత్త పోస్టుమాస్టర్ రావడంతో సీతారాం మళ్లీ ఉత్తరాల బట్వాడా విధుల్లో చేరి అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెల్సింది. సస్పెండ్ చేస్తే అనవసరంగా సగం జీతం ఇవ్వాల్సివస్తుందని పోస్టల్ ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పోస్టుమెన్ తాను విధులు నిర్వహించకుండా ఇతరులతో బట్వాడా చేయిస్తున్నందున వారిపై సైతం చర్యలు తీసుకుని పూర్తి విచారణ చేయాలని బాధితులు కోరుతున్నారు. సీతారాంను ప్రజలతో సంబంధం లేని పనులకు వినియోగించుకోవాలని అంటున్నారు. ఆధార్, పాసుపోర్టు, ఎల్ఐసీ సంస్థలు పోస్టాఫీసుతో అవగాహన ఒప్పందం చేసుకున్నందున నిబంధనల మేరకు సీతారాంపై పోలీసు కేసులు నమోదు చేసి విచారణ చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాం

పోస్టుమెన్ సీతారాం ఉత్తరాలు బట్వాడా చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాను. గతంలోనూ నిర్లక్ష్యం చేయగా శాఖాపరంగా చర్యలు తీసుకున్నారు. తిరిగి మళ్లీ అదే అక్రమాలకు పాల్పడుతున్నారు. రిజిస్టర్ లెటర్లు బట్వాడా చేసినట్టు చూపిస్తున్నందున బాధితులు ఫిర్యాదు చేస్తేనే విషయం మాకు తెలుస్తుంది. సీతారాం ఎక్కడ నివాసం ఉందేది ఎవరికీ తెలియదు. బస్తాల కొద్ది ఉత్తరాలు ఎక్కడ ఉంది తెలియదు. పారేసిన ఉత్తరాల ఫొటోలు ఎక్కడ తీసింది తెలియదు. సీతారాం నిన్నటి నుంచి పరారీలో ఉన్నారు.

– ఆర్ రాజు, ఇన్‌చార్జి పోస్ట్‌మాస్టర్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ మీ ఇంట్లో కబోర్డ్స్, DOORS, WINDOWS చేయించాలనుకుంటున్నారా మా Polywood కంపెనీ యొక్క Pvc, WPC, upvc మెటీరియల్‌తో చెదలు పట్టదు, నీటిలో తడవదు కలర్ పోదు తక్కువ ఖర్చు ఎక్కువ మన్నిక, సంప్ర: 94405 75979, 94413 51951, 91331 26121. [Z-788563]

CHANGE OF NAME

■ I, RENUKA DARAVATH W/o. DHARAVATH BHEEM SINGH (Old Name) R/o. H.No. 7-117/5, Laxmi Priya Nagar, Road No.8, Gangagayathri Nagar, Mubarak Nagar, Nizamabad, Telangana - 503002. I Have Changed my Name as RENUKA CHAVAN W/o. DHARAVATH BHEEM SINGH [Z-799569]

REAL ESTATE

PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్లమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

WANTED

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221494]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ ఆపరేటర్స్ /క్లర్క్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006. [G-7531]

■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని సింగితం గ్రామానికి చెందిన గండివేట్ రాంబోయి(55) అనే జాలరి గురువారం సింగితం వాగులో గల్లంతై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాంబోయి వాగులో చేపల వేట చేస్తుండగా వరద నీరు ఒక్కసారి ఉధృతంగా రావడంతో తెప్పమీద నుంచి పట్టుతప్పి వరద నీటిలోకి కొట్టుకుపోయాడన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వెంగళంపల్లి శివారులోని సింగితం వాగులో మృతదేహం లభ్యం కావడంతో బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

మద్నూర్(జుక్కల్) : మండలంలోని లచ్చన్‌కు చెందిన మట్టంవార్ పెంటయ్య(65) గ్రామ శివారులోని లోటెన్ చెరువులో పడి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెంటయ్య కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని ఆర్నెళ్ల క్రితం ఆపరేషన్ జరిగిందన్నారు. అప్పటి నుంచి తీవ్రనొప్పితో పెంటయ్య అవస్థలు పడ్డాడన్నారు. కొన్ని రోజుల క్రితం జుక్కల్ మండలంలోని నాగల్‌గావ్‌లో తన కూతురు ఇంటి వద్ద ఉంటూ వారి గొర్రెలకు కాపలాగా పనిచేసేవాడన్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పెంటయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా పెద్ద ఎక్లార శివారులోని చెరువులో పెంటయ్య మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారన్నారు. అనారోగ్య కారణాలతోనే పెంటయ్య చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని వారి కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వన సేవకుడు..



మృతుడు నడిపి గంగాధర్

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం చౌడమ్మ కొండూరు గ్రామ పల్లె ప్రకృతి వన సేవకుడు కాసర్ల నడిపి గంగాధర్ (50) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పల్లెప్రకృతి వనం మినీ బృహత్ పార్క్‌లో కరెంటు వైర్ కిందికి వేలాడుతున్నదని తీయబోతుండగా గంగాధర్ కరెంటు షాక్‌కు గురయ్యాడు. గొర్ల కాపర్లు ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయడంతో గంగాధర్ కరెంట్ వైర్ నుంచి విడపోయాడు. ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్‌గౌడ్ మరో వ్యక్తితో కలిసి గంగాధర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాని మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గంగాధర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు బోల్తా: ఆరుగురికి గాయాలు

మాచారెడ్డి : పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లి స్టేజీ వద్ద కామారెడ్డి సిరిసిల్ల రహదారిపై శుక్రవారం ఓ కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి ఆరుగురికి గాయాలయ్యాయి. వేములవాడకు చెందిన నిర్మల, శాన్వి, అక్షయ, రాజు, లత, దేవరాజు కామారెడ్డి మండలం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. పాల్వంచ వాగు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

ఇందల్వాయి : ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన కాసుల సవిత (32) అనే వివాహిత జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తొర్లికొండకు చెందిన సవితకు గన్నారం గ్రామానికి చెందిన కాసుల నగేష్‌తో 2008లో వివాహం జరిగింది. వీరికి లక్కీ, కావ్య, శ్రావ్య అనే ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఉపాధి నిమిత్తం నగేశ్ గల్ఫ్‌లో ఉంటున్నాడు. అందరితో కలివిడిగా ఉండే సవిత ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సవిత అన్న వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్‌టౌన్(బోధన్) : ఈనెల 13వ తేదీన రుద్రూర్ మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసును ఛేదించి 7.80 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకొని, చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని ఏసీపీ ఆఫీస్‌లో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్ వ్యాపారి నారాయణ, అతడి భార్య నాగమణి రుద్రూర్ మండల కేంద్రంలో నివాసముంటున్నారని, నారాయణ లేని సమయంలో వారి ఇంట్లోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై ఉన్న బంగారు నగలు, చెవికమ్మలు మొత్తంగా 7.80గ్రామలు బంగారం దోచుకెళ్లాడన్నారు. రుద్రూర్ పీఎస్‌లో భార్యభర్తలు ఫిర్యాదు చేయగా సీఐ జయేష్‌రెడ్డి వర్ని ఎస్సై కృష్ణకుమార్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఘటనాస్థలంలో క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు తీసుకుని విచారించగా వేలిముద్రలు నస్రుల్లాబాద్‌కు చెందిన దుర్గాప్రసాద్‌తో సరిపోయాయన్నారు. దీంతో నిందితుడిని రెండు రోజుల క్రితం వర్ని బస్టాండ్‌వద్ద పట్టుకుని విచారించగా చోరీ తానే చేశానని, నగలను బొప్పాస్‌పల్లికి చెందిన వినోద్‌నాయక్‌కు రూ. 60వేలకు ఇచ్చేశానన్నాడు. వినోద్‌నాయక్‌ను పట్టుకుని నగలను, అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ పేర్కొన్నారు. సీఐ బృందంతో పాటు, రుద్రూర్ ఎస్సై నీరేష్, వర్ని ఎస్సైని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ అభినందించారని, రివార్డు కోసం రిఫర్ చేశామని ఏసీపీ పేర్కొన్నారు.